సాక్షి నిర్మల్

బుధవారం । 18 । అక్టోబర్ । 2023

దుర్గమ్మా.. దీవించు

జిల్లాలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని వివిధ మండపాల్లో అమ్మవారిని మంగళవారం వివిధ రూపాల్లో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చనలు నిర్వహించారు. దీపాలంకరణ చేశారు. సాయంత్రం మండపాల వద్ద మహిళలు, యువతులు బతుకమ్మ, కోలాటం ఆడారు. 10లో▸



గరిష్టం/కనిష్టం
34.4/22.4

వాతావరణం

వాతావరణం పొడిగా, చాలా వరకు ఎండగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా ఎక్కువగా నమోదవుతాయి. రాత్రి మంచుకురుస్తుంది.

న్యూస్‌రీల్

మొక్కలునాటి సంరక్షించాలి



ట్రిపుల్‌ఐటీలో మొక్కలు నాటుతున్న వీసీ

భైంసా: మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అన్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో చిల్డ్రన్స్ పార్కు, వీఐపీ గెస్ట్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం పండ్ల మొక్కలు నాటారు. ఇప్పటికే ట్రిపుల్‌ఐటీలో మొక్కలు బాగా పెరిగాయని ఎక్కడ ఖాళీస్థలం ఉన్నా అక్కడ మొక్కలు నాటుతున్నామని ఇన్‌చార్జి వీసీ వెల్లడించారు. బాసర ట్రిపుల్‌ఐటీలో ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించేలా మొక్కలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ సిబ్బంది సీఐ రాకేశ్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సతీశ్‌రెడ్డి, అధ్యాపకులు శ్రీశైలం, అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ప్రవల్లికది ప్రభుత్వ హత్యే’

నిర్మల్‌టౌన్:గ్రూప్–2 అభ్యర్థి, డీఎస్సీకి సిద్ధమవుతున్న ప్రవల్లికది ఆత్మహత్య కాదని, ప్రభుత్వ హత్యే అని అఖిల భారతీయ యాదవ మహాసభ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కర్రొల్ల శంకర్‌యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. ప్రవల్లిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.75 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రవల్లిక కుటుంబంలో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఉద్యోగం రాలేదని ఆత్మహత్య చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు ధైర్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సాయన్న యాదవ్, సభ్యులు సుమన్‌యాదవ్, కమలాకర్‌యాదవ్, నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.


గంగనీళ్ల జాతర ఏర్పాట్లు పరిశీలన



సర్పంచ్‌తో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

దిలావర్‌పూర్: శరన్నవరాత్రుల్లో భాగంగా ఏటా జిల్లాలో జరిగే అతిపెద్ద ఉత్సవం గంగనీళ్ల జాతర. ఈ జాతరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం సాంగ్వి గోదావరి పరీవాహక ప్రాంతంతోపాటు అక్కడే ఉన్న మహాపోచమ్మ ఆలయాన్ని పోలీసు అధికారులు పరిశీలించారు. సారంగపూర్ మండలంతోపాటు దిలావర్‌పూర్ మండలంలో కొనసాగే ఈజాతరలో భాగంగా అడెల్లి మహాపోచమ్మ అమ్మవారి ఆభరణాలను ఆలయం నుంచి దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వి గ్రామానికి తీసుకెళ్లి గోదావరి జలాలతో శుద్ధిచేసి తిరిగి ఆలయానికి తీసుకెళ్తారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పోలీసులు పరిశీలించారు. శనివారం సాంగ్వి గోదావరి పరీవాహక ప్రాంతానికి చేరుకునే భక్తులకు, గ్రామంలో అమ్మవారి ఆలయం వద్ద భక్తుల ఏర్పాట్లకు సంబంధించి సర్పంచ్ అచ్చుత్‌రావుతో డీఎస్పీ గంగారెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సై యాసిర్ అరాఫత్ చర్చించారు.

కొత్త పాఠశాలల్లో వేతనం చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న టీయూటీఎఫ్ నాయకులు

నిర్మల్ రూరల్: ఇటీవల బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లకు అక్టోబర్ నెల పూర్తి వేతనం కొత్త పాఠశాలలోనే ఇచ్చేలా చర్యలు చేపట్టాలని జిల్లా సహాయ ట్రెజరీ అధికారి గంగాధరయ్యకు తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) నాయకులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లు ఈనెల 2, 8వ తేదీల్లో రిలీవై మరుసటి రోజున కొత్త పాఠశాలల్లో చేరారన్నారు. రెండు పాఠశాలలో విడివిడిగా నెలవారీ బిల్లులు చేయడం వలన జీతం రావడం ఆలస్యం అవుతుందన్నారు. గతంలో 317 జీవో ఉపాధ్యాయుల వేతనం మాదిరి ఇప్పుడు కూడా బదిలీ పొందిన ఉపాధ్యాయుల అక్టోబర్ మొత్తం వేతనం కొత్త పాఠశాలలో పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎ.మురళిమనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.లక్ష్మీప్రసాద్‌రెడ్డి, తోడిశెట్టి రవికాంత్, నాయకుడు బలిరాం పాల్గొన్నారు.



వలస జీవుల జంగ్!

- జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో గల్ఫ్ కార్మికుల ప్రభావం
- వారి కుటుంబీకుల ఓట్లూ కీలకమే
- ఎటు మొగ్గితే ఆ పార్టీ విజయం ఖాయం
- ఈసారి నామినేషన్లు వేసే యోచన
- డిమాండ్ల సాధనే ప్రధాన లక్ష్యం..



ఇటీవల దుబాయ్‌లో సమావేశమైన గల్ఫ్‌కార్మిక సంఘాల ప్రతినిధులు

నిర్మల్‌ఖిల్లా: ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన జిల్లా వాసులు.. ఈ ఎన్నికల్లో జంగ్ లేపేందుకు సిద్ధమవుతున్నారు. గత రెండు ఎన్నికల్లో గల్ఫ్‌పాలసీ హామీతో బీఆర్‌ఎస్‌వైపు మొగ్గు చూపారు. కానీ పదేళ్లలో హామీ నెరవేర్చకపోవడంతో ఈసారి వారి కుటుంబ సభ్యులను అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలపాలని భావిస్తున్నారు. నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో వలస జీవుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసేస్థాయిలో గల్ఫ్ కార్మిక కుటుంబాల ఓట్లు ఉన్నాయి. గల్ఫ్ దేశాలైన దుబాయ్, ఒమన్, మస్కట్ సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, బహ్రెయిన్, కువైట్, మలేషియా, ఖతార్ తదితర దేశాల్లో జిల్లా వాసులు ఉన్నారు.

గల్ఫ్ పాలసీ కోసం డిమాండ్..

జిల్లాలోని నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన వేల మంది యువత ఉద్యోగ అవకాశాల కోసం గల్ఫ్ దేశాలకు పయనమయ్యారు. దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన చాలా మంది ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లొచ్చారు. వారిని చూసి యువత కూడా గల్ఫ్ బాట పడుతోంది. అయితే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుంచి గల్ఫ్ కార్మికులు, వెళ్లొచ్చిన వారు ఎన్‌ఆర్‌ఐ పాలసీని గల్ఫ్ దేశాల కార్మికులకు వర్తింపజేయాలని కోరుతున్నారు. ఎన్నారై పాలసీ, గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్లో రూ.500 కోట్లు కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఎన్నికల సమయంలో అన్ని పార్టీల నేతలు హామీ ఇస్తున్నారు. గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఈసారి గల్ఫ్ కార్మికుల కుటుంబాలు కూడా ఎన్నికల్లో నామినేషన్లు వేయాలని భావిస్తున్నారు.

నెరవేరని హామీలు...

గతంలో రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ దేశాల వలసలకు అడ్డుకట్ట వేయాలని భావించి సాధారణ పరిపాలన శాఖ ఎన్‌ఆర్‌ఐ సెల్ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రైవేటు అన్ రిజిస్టర్డ్ ఏజెంట్ల బారిన పడకుండా వారి మోసాలను అరికట్టడానికి ప్రభుత్వమే మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ఏజెన్సీలను నెలకొల్పింది. అయినా ఎన్‌ఆర్‌ఐ సెల్ ఈ గల్ఫ్ వలసలను అరికట్టలేకపోయింది. కేంద్ర ప్రభుత్వం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వెబ్‌సైట్ ద్వారా గల్ఫ్ బాధితులకు సహాయం పొందడానికి కార్మికులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఇవన్నీ సరైన సేవలను అందించడం లేదు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో వలస కార్మికుల కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నెలకొల్పి ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నా విమర్శలున్నాయి.

1.85 లక్షల మంది గల్ఫ్ ప్రభావిత ఓటర్లు..

నిర్మల్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 6,21,454 ఓటర్లు ఉన్నారు. ఇందులో గల్ఫ్ కార్మికులు, గల్ఫ్ నుంచి తిరిగి వచ్చిన వారు, వారి కుటుంబ సభ్యులు మొత్తం కలిపి 1,86,400 మంది ఓటర్లు ఉన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో 2,47,495 మంది ఓటర్లు ఉండగా గల్ఫ్ ప్రవాసీలు, వారి కుటుంబ సభ్యులు 73,400 మంది ఉన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో 2,17,665 మంది ఓటర్లు ఉండగా గల్ఫ్ ప్రవాసీలు వారి కుటుంబ సభ్యులు మొత్తం 62 వేల మంది ఉన్నారు. ముధోల్ నియోజకవర్గంలో 2,46,030 మంది ఓటర్లు ఉండగా గల్ఫ్ ప్రవాసీలు వారి కుటుంబ సభ్యులు మొత్తం 51 వేల మంది ఉన్నారు.

గల్ఫ్ కార్మికుల డిమాండ్లు ఇవీ...

- గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్న తెలంగాణ కార్మికుల లెక్క తేల్చడానికి కేరళ ప్రభుత్వ తరహాలో ప్రత్యేక సర్వే నిర్వహించాలి. దాని ఆధారంగా గల్ఫ్ వలస కుటుంబాలకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయాలి.
- కేరళ మాదిరిగానే ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి.గల్ఫ్ బోర్డును ఏర్పాటుచేస్తూ ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి.
- ఏజెంట్ల బారినపడి మోసపోయిన బాధితులకు స్వయం ఉపాధి కింద రాయితీ రుణాలు ఇవ్వాలి. లైసెన్స్‌లేని ఏజెంట్ల వ్యవస్థకు అడ్డుకట్ట వేయాలి.
- కార్మికులకు ఉచిత శిక్షణనిచ్చి.. నైపుణ్యాలు అలవర్చుకున్నాకే వీసా ప్రక్రియను ప్రారంభించాలి.
- గల్ఫ్‌లో ఉపాధి పొందుతూ ప్రమాదాల వల్ల ఆరోగ్యం దెబ్బతిన్న వారికి ప్రభుత్వం అధునాతన వైద్యం అందించడానికి ఏర్పాట్లు చేయాలి. గల్ఫ్‌లో మరణించిన వారి మృతదేహాలను తెప్పించడానికి ప్రభుత్వం చొరవ చూపడంతోపాటు కార్మికులకు రావాల్సిన జీతభత్యాలను ఇప్పించాలి. బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలి.
- గల్ఫ్ వెళ్లిన కార్మికులకు ఉచిత బీమా సౌకర్యం, గల్ఫ్ నుంచి ఇళ్లకు చేరిన వారికి పింఛన్లు ఇవ్వాలి. గల్ఫ్ దేశాల్లో కార్మికులకు లేబర్ కోర్టులలో న్యాయపరమైన సలహా, సేవలు అందించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.
- గల్ఫ్ బాధితుల కుటుంబాలకు చెందిన బాలబాలికల కోసం రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో కొన్ని సీట్లు కేటాయిస్తూ రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి. గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉచిత న్యాయసహాయం అందించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమాభివృద్ధి వ్యూహాన్ని అమలు చేసి కార్మికుల ఆర్థిక, సామాజిక, ఆరోగ్య స్థితిగతులను మెరుగుపరిచే చర్యలు చేపట్టాలి.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు, గల్ఫ్ ప్రభావిత ఓటర్ల వివరాలు...(2023)

నియోజకవర్గం	నిర్మల్	ఖానాపూర్	ముధోల్
మొత్తం ఓటర్లు	2,47,495	2,17,665	2,46,030
గల్ఫ్ కార్మికులు, రిటనీలు, వారి కుటుంబ సభ్యులు	73,400	62,000	51,000
మొత్తం ఓట్లలో గల్ఫ్ ప్రభావం శాతం	30 శాతం	29 శాతం	21 శాతం


సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం...



దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న గల్ఫ్ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో గల్ఫ్‌లో ఉన్న కార్మికులు, తిరిగివచ్చినవారు, ప్రవాస కుటుంబ సభ్యులతో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో నామినేషన్లు వేయిస్తాం. గల్ఫ్ కార్మిక కుటుంబ సభ్యులతో సభ నిర్వహించి చైతన్యవంతం చేసి గల్ఫ్ సంఘాల అభ్యర్థులకు మద్దతు ప్రకటించేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఎన్నారై పాలసీ, గల్ఫ్ బోర్డు సాధనే మా ప్రధాన లక్ష్యం.

– స్వదేశ్ పర్కిపండ్ల, రాష్ట్ర అధ్యక్షుడు, ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్

గల్ఫ్ కార్మికులపై వివక్ష..



గల్ఫ్ కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయి. ఎడారి దేశాలలో పనిచేసే కార్మికులు తాము సంపాదించిన సొమ్మును విదేశీ మారకద్రవ్యం రూపంలో పంపిస్తున్నారు. కానీ హక్కులు పొందలేకపోతున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కనిపించే హామీలు, ప్రసంగాల్లో వినిపించే మాటలు చేతల్లో కనిపించడం లేదు. అందుకే ఎన్నికల్లో ఓటు రూపంలో సమాధానమిస్తాం.

–మంద భీంరెడ్డి, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకులు

ఇంటి నుంచే ఓటు

- దివ్యాంగులు, వృద్ధులకు అవకాశం

భైంసాటౌన్: దివ్యాంగులు, వృద్ధులు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటేయాలంటే వారితోపాటు వారి సహాయకులు కూడా రావాలి. ఇది ప్రయాసతో కూడిన పని. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులను ఆటోలు, ఇతర వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చి చేతులతో ఎత్తుకువెళ్లిన దృశ్యాలు ఎన్నో చూశాం. గత ఎన్నికల వరకు ఇలాంటి ఓటర్లను పోలింగ్‌కేంద్రాలకు రప్పించేందుకు ప్రత్యేకంగా ఆటోలు సైతం కేటాయించేవారు. కానీ, ఈసారి ఇలాంటి ఇబ్బందులు లేకుండా దివ్యాంగులు, వృద్ధులు ఇంటి నుంచే పోస్టల్ బ్యాలట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించింది. ఈ అసెంబ్లీ ఎన్నికల నుంచే అందుబాటులోకి రానుంది.

ఏం చేయాలంటే...

దివ్యాంగులు, 80 ఏళ్ల పైబడిన వారు ఇంటి నుంచి ఓటు వేయవచ్చు. ఇందుకు ముందుగా సంబంధిత అధికారులకు ఫారం 12డి ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ పూర్తయి, తుదిజాబితా వెల్లడైన మరుసటి రోజు నుంచే ఈ దరఖాస్తులు స్వీకరిస్తారు. ఏయే తేదీల్లో దరఖాస్తులు స్వీకరిస్తారో అధికారులు ప్రకటిస్తారు. పోలింగ్ తేదీకి ఐదురోజుల ముందే పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను స్థానిక బీఎల్‌వోలకు అందించాల్సి ఉంటుంది.

జిల్లాలో దివ్యాంగ, వృద్ధుల ఓట్ల వివరాలిలా..

నియోజకవర్గం	వృద్ధులు	దివ్యాంగులు
ఖానాపూర్	2,420	3,293
నిర్మల్	3,170	4,290
ముధోల్	3,760	4,380
మొత్తం	9,350	1,1963

అమ్మవారికి మహా నైవేద్యం



అమ్మవారికి సమర్పించిన 108 రకాల ప్రసాదాలు

లక్ష్మణచాంద:దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చామన్‌పల్లి దుర్గామాత వద్ద ఆలయ కమిటి సభ్యులు మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు చేసి 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి ఎదుట 1,116 దీపాలు వెలిగించారు.

మా ఊరికి రావొద్దు..

- తహసీల్దార్‌ను వెనక్కి పంపిన గంగాపూర్ వాసులు

కడెం: తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించే వరకు ఎవరూ రావొద్దని తహసీల్దార్ రాజేశ్వరిని గంగాపూర్ గ్రామస్తులు వెనక్కి పంపారు. కడెం మండలం మారుమూల ఉమ్మడి గంగాపూర్ జీపీ వాసులు ఏళ్లుగా తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. రోడ్డు నిర్మించకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని ఇప్పటికే ప్రకటించారు. ఈ క్రమంలో గ్రామంలో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించేందుకు తహసీల్దార్ రాజేశ్వరి మంగళవారం గ్రామానికి వెళ్లారు. తహసీల్దార్‌ను అడ్డుకున్న గ్రామస్తులు సమస్యను వివరించారు. తహసీల్దార్ రాజేశ్వరి ఈ విషయమై అదనపు కలెక్టర్ కిశోర్, ఆర్‌వోకు ఫోన్‌లో సమాచారం అందించారు. కడెం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో వంతెన నిర్మాణానికి టెండర్ పిలిచారని, త్వరలో పనులు చేపడుతారని అదనపు కలెక్టర్ సర్పంచులకు తెలిపారు. అయినా గ్రామస్తులు వినలేదు. దీంతో తహసీల్దార్ బూత్‌లను పరిశీలించకుండానే వెనక్కి వెళ్లిపోయారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేశ్వరి

కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలను ఓడించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్



మాట్లాడుతున్న బొమ్మెన సురేశ్

నిర్మల్‌చైన్‌గేట్:సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మరో పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలని, రానున్న ఎన్నికల్లో ప్రజావ్యతిరేక పాలకులను ఓడించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ కోరారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజమణి ఆధ్వర్యంలో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ఏ మాత్రం చొరవ చూపలేదని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి సమ్మెలోకి వెళ్తే సమ్మె చేసే కార్మికులతో, యూనియన్లతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని అడ్డగోలుగా మాట్లాడుతున్నారన్నారు. అప్రజాస్వామిక పద్ధతుల్లో వ్యవహరిస్తున్న రాష్ట్ర బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాల్లో అనేక మార్పులు తెచ్చి, నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. ఈ లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా స్వతంత్రంగాను, ఇతర కార్మిక సంఘాలతో కలిసి పోరాటాలు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్మిక రంగాలలో అత్యధిక మంది మహిళలే ఉన్నారని, వీరికి చట్టబద్ధంగా హక్కులు కల్పించాలని కోరారు. రోజురోజుకూ పనిభారం పెంచుతూ, పని గంటలను పెంచుతూ శ్రమదోపిడీకి గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చే పార్టీలను, అభ్యర్థులను నిలదీయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.లలిత, జిల్లా కోశాధికారి శైలజ, జిల్లా నాయకులు గంగామణి, విజయ, వెంకటలక్ష్మి, ఫర్జాన పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత



బాధితులకు ఫోన్ అప్పగిస్తున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: మొబైల్ ఫోన్ పోతే ఆందోళన వద్దని, ఫోన్ పోతే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో లేదా మీ సేవ ద్వారా ఫిర్యాదు చెయ్యాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. https://www.ceir.gov.in/ వెబ్‌పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీ తెలుసుకోవడం చాలా సులభమన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న 12 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా గుర్తించి, స్వాధీనం చేసుకుని ఎస్పీ చేతుల మీదుగా బాధితులకు మంగళవారం అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. మార్కెట్‌లో చౌకగా వస్తుందని సెకండ్ హాండ్ ఫోన్‌లు కొనే ముందు సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఆ ఫోన్ ఐఎంఈఐ నంబర్ నమోదు చేసుకోవాలన్నారు. చోరీ అయిన ఫోన్‌లను వెతికి పెట్టడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందని తెలిపారు. టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొత్తగా ప్రవేశ పెట్టిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) అనే అప్లికేషన్ ఫోన్‌ను వెతికి పెట్టడాని కి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నా రు. ఈ అప్లికేషన్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ వెబ్‌సైట్ ద్వారా ఇప్పటివరకు 248 ఫోన్లను గుర్తించి రికవరీ చేశామన్నారు. ఐటీ కోర్ ఇన్‌చార్జి రవికుమార్, వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు

- ఎస్పీ ప్రవీణ్ కుమార్



నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇందులో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసు విధులు, త్యాగాలు, సాంకేతిక వినియోగం, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, మొదలగు విషయాలను ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. https://forms.gle/b7bejvzfo6j29Vuz6 వెబ్సైట్ ద్వారా వ్యాసరచన పోటీలను తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో నిర్వహిస్తామని వివరించారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పోలీసు అమరవీరులను స్మరిస్తూ.. సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. పోలీస్ అమరవీరుల కుటుంబాల దగ్గరికి వెళ్లి వారి త్యాగాలకు గుర్తుగా నివాళులర్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రధాన కూడళ్ల వద్ద పోలీస్ అమరవీరుల బ్యానర్లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 21న పోలీస్ కార్యాలయం నందు ‘పోలీస్ అమరవీరుల సంస్మరణలో ఘనంగా నివాళులర్పిస్తూ.. స్మృతి పరేడ్, పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

వ్యాసరచన పోటీలు కేటగిరీల వారీగా

కేటగిరి– 1 ఇంటర్మీడియట్ విద్యార్థులకు సమర్థవంతమైన పోలీసింగ్ కోసం సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పై పోటీ.

కేటగిరి– 2 డిగ్రీ ఆపై విద్యార్థులకు సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఆన్‌లైన్‌లో ఈనెల 24 వరకు పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి, రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు పంపుతామని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు

కేటగిరీ–1 కానిస్టేబుల్ నుంచి ఏఎస్సైస్థాయి వరకు పోలీసుల పని–జీవిత సమతుల్యతపై పోటీ.

కేటగిరి –2 ఎస్సై స్థాయి అధికారి నుంచి పైస్థాయి అధికారుల వరకు సమాజంలో లింగ సమానత్వాన్ని కాపాడడంలో పోలీసుల పాత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషలలో 500 పదాలకు మించకుండా ఉంటాయని తెలిపారు. ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి అవార్డులు ప్రదానం చేసి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

షార్ట్ ఫిలిమ్స్, ఫొటోగ్రఫీ పోటీలు

విద్యార్థులకు, యువతకు, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు, వీడియో గ్రాఫర్లకు, పోలీసులు చేసిన సేవలకు సంబంధించిన ఫొటోలు లేదా రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాలలో పోలీసుల సేవ, ఇతర పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలపై మూడు నిమిషాలకు తగ్గించకుండా షార్ట్ వీడియోలను రూపొందించాలని, ప్రతిభ కనబరిచిన మొదటి మూడు ఫొటోలను, వీడియోలను ఎంపిక చేసి బహుమతి ప్రదానం చేసి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఫొటోలు, వీడియోలు ఈనెల 25 లోపు జిల్లా కేంద్రంలోని స్పెషల్ బ్రాంచ్ కార్యాలయంలో అందించాలని తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్:ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేయనున్న ఈవీఎంల భద్రత, రిసెప్షన్ కేంద్ర ఏర్పాటు, పాల్ టెక్నిక్ కాలేజీలో కౌంటింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఈవీఎంల భద్రతకు గదులు, భద్రత దృష్ట్యా చేపట్టాల్సిన చర్యలను పరిశీలించారు. రిసెప్షన్ కేంద్రం, భోజనం, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియ చేపట్టే విద్యా సంస్థల యాజమాన్యాలకు ఈ విషయం ముందుగా తెలియజేయాలని సూచించారు. ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్, అదనపు ఈవీఎంలతో సహా భద్రపర్చడానికి సరియైన హాల్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈవీఎం కమిషనింగ్‌కి అనువైన హాల్ చూడాలన్నారు. అనువుగా ఉండేందుకు భవనాలకు తాత్కాలిక మార్పులు చేపడితే, ఎన్నికల ప్రక్రియ తర్వాత యథాస్థితి తిరిగి అప్పగించాలన్నారు. వారివెంట ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



ఎన్నికల ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

క్లుప్తంగా

వైఎస్సార్‌కాలనీలో తనిఖీలు

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని వైఎస్సార్ కాలనీలో రూరల్ పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో పలు దుకాణాలు, అనుమానిత ఇళ్లను తనిఖీ చేశారు. ఆటోలో తరలిస్తున్న 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కిరాణా దుకాణంలో నిల్వ ఉంచిన రూ.15 వేల విలువ గల టపాసులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి

తానూరు: సరిహద్దులో ప్రాంతంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ముథోల్ సీఐ వినోద్ అన్నారు. మహారాష్ట్ర సరిహద్దులోని జౌలా(బి) సమీపంలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఎస్సై సందీప్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య

తలమడుగు: పెళ్లి కావడం లేదని యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ధనశ్రీ కథనం ప్రకారం..మండలంలోని పల్లి (కె) గ్రామానికి చెందిన చింతల పెళ్లి ఉపేందర్‌రెడ్డి (30) గతేడాది గుండెకు సంబంధించి ఆపరేషన్ చేయించుకున్నాడు. దీంతో పెళ్లి సంబంధాలు వచ్చి వెళ్లిపోతున్నాయి. నాకు పెళ్లి కాదేమోనని మనస్తాపంతో ఆదివారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించించి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. తండ్రి లింగారెడ్డి ఫిర్యాదుతో ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి మొక్కలు ధ్వంసం


ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నార్నూర్: మండలంలోని చోర్‌గావ్ శివారు లోని పంట పొలాల్లో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను మంగళవారం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై టి.మహేందర్ తెలిపారు. కసావత్‌ సోనుసింగ్ తన పొలంలో పత్తి, కంది పంటతోపాటు గంజాయి సాగు చేస్తున్నారని ఎక్సైజ్ అధికారి హిమశ్రీకి అందిన సమాచారంతోనే దాడులు నిర్వహించామన్నారు. రూ.5.60 లక్షల విలువ గల 56 గంజాయి మొక్కలను ధ్వంసం చేసి సోనుసింగ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది ఆశన్న, విశాల్, శ్రావణి, సరిత పాల్గొన్నారు.

దాడి చేసిన ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: ఒకరిపై దాడి చేసి గాయపర్చిన ఇద్దరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ రాంనగర్‌కు చెందిన సొన్‌కాంబ్లే దేవిదాస్ ఆదిలాబాద్‌లోని దస్నాపూర్‌లో గల బజాజ్ షోరూంలో ఉద్యోగం చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన విశాల్, శ్యాంలు గతంలో దేవిదాస్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ కేసును వెనక్కి తీసుకోవాలంటే రూ.35 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన వద్ద డబ్బులు లేవని అనడంతో దేవిదాస్‌పై దాడికి దిగడంతో గాయాలయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైక్ చోరీ

భైంసా: బాసరలో బైక్ చోరీకి గురైంది. మహేశ్ కుమార్ తన ఇంటి ముందు సోమవారం బైక్ నిలిపి ఉంచాడు. జ్వరం రావడంతో బైక్ హ్యాండిల్ లాక్‌వేయడం మరిచిపోయాడు. మంగళవారం బైక్ చూస్తే కనిపించలేదు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.

పత్రం చూపకుంటే చిక్కులే..

- రూ.50 వేల నగదు దాటితే ఆధారాలు తప్పనిసరి
- పోలీసుల తనిఖీల ముమ్మరం
- నగదు, మద్యం తరలింపుపై ప్రత్యేక నిఘా

జంగ్ తెలంగాణ

నిర్మల్‌ఖిల్లా: శాసన సభ ఎన్నికలకు ప్రకటన వెలువడి నియమావళి అమల్లోకి రావడంతో పోలీసుల తనిఖీలు ముమ్మరం చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిబంధనలు పక్కాగా అమలు చేయడంపై అధికార యంత్రాంగం దృష్టిసారించింది. అక్రమంగా డబ్బు, మద్యం తరలింపుపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. జిల్లావ్యాప్తంగా తనిఖీల్లో నగదు ఆభరణాలు, విలువైన వస్తువులు పట్టుబడుతున్నాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే సరైన ఆధారాలు చూపాల్సి ఉంటుంది.


సారంగాపూర్ మండలం మలక్‌చించోలి దారిలో మద్యం బాటిళ్లు పట్టుకున్న పోలీసులు (ఫైల్)

ఆధారాలు తప్పనిసరి

రూ.50 వేలకు పైగా నగదు వెంట తీసుకెళ్తే కచ్చితంగా సంబంధిత నగదుకు రసీదులు ఆధారపత్రాలు ఉండాలి. లేకపోతే నగదును సీజ్ చేస్తారు. రూ.10 లక్షలకు పైగా నగదు ఉంటే ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమాచారం చేరవేస్తారు. ఆదాయపన్ను శాఖకు విషయం చేరుతుంది. పట్టుబడిన సందర్భంలో ఆధారాలు లేకపోతే నగదును తిరిగి పొందాలంటే జిల్లా ట్రెజరీశాఖ వారికి ఆధారాలు సమర్పించాల్సి ఉంటుంది. వ్యాపార లావాదేవీల నగదును రవాణా చేస్తున్నట్లయితే చట్టబద్ధంగా ఆధారాలు, పన్నులు సక్రమంగా కట్టిన రసీదులు వెంట కలిగి ఉండాలి. కుటుంబంలో వివాహం, వైద్యం వ్యవసాయం, ఇతరత్రా అవసరాలకు నిర్దేశిత మొత్తం దాటితే సంబంధిత వివరాల ఆధారాలు బిల్లులను చూపాల్సి ఉంటుంది.

కొన్ని ఘటనలు..

- మహారాష్ట్ర నుంచి తానూరు మీదుగా బైంసాకు వస్తుండగా రూ.1,40,000 నగదును ఎస్సై సందీప్ పట్టుకున్నారు.
- సారంగపూర్ మండల పరిధిలోని సిరిపెల్లి వద్ద గల చెక్‌పోస్టు వద్ద మహారాష్ట్ర నుంచి తెస్తున్న మద్యం సీసాలను పోలీసులు పట్టుకున్నారు.
- సోన్ వద్ద బైక్‌పై రూ.50 వేలకు మించి తీసుకెళ్తున్న యువకుల నుంచి నగదును సీజ్ చేశారు.
- కుంటాల మండలం అర్లి(కే) రహదారి వద్ద రూ.లక్షా 62 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.
- సారంగాపూర్ మండలంలోని మలక్‌చించోలి సమీపంలో రూ.30 వేలు విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

నిరంతర నిఘా

జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలు, ప్రధాన కేంద్రాల్లో తనిఖీల ప్రక్రియ ముమ్మరమైంది. ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో పోలీసుశాఖ నేతృత్వంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. రోజు 24 గంటలు ప్రత్యేక నిఘాతో నిబంధనల మేరకు నిర్వర్తిస్తున్నారు. అలాగే మద్యం, డబ్బులు ఇతరాత్ర మభ్యపెట్టే వస్తువులను చేరవేస్తున్నట్లు సమాచారం అందితే వాటిని సీజ్ చేయనున్నారు.

ఆధారాలుంటే వారంలో వాపస్..

తనిఖీల్లో పట్టుబడ్డ నగదును మొదట జిల్లా ట్రెజరీ అధికారికి అప్పగిస్తారు. ఆ నగదుకు సంబంధిత ఆధారపత్రాలు వెంటనే చూపకపోయినా ఆ తర్వాత జిల్లాస్థాయిలో ఏర్పాటైన అధికారుల కమిటీకి సమర్పించాల్సి ఉంటుంది. అప్పుడు సీజ్ చేసిన నగదును తిరిగి పొందవచ్చు. జిల్లాస్థాయిలో అదనపు కలెక్టర్ కన్వీనర్‌గా, డీసీవో, జిల్లా ఖజానా అధికారి సభ్యులుగా ఉండే ఈ కమిటీ కలెక్టరేట్లో అందుబాటులో ఉంటారు. పట్టుబడిన నగదుకు సంబంధించిన ఆధారాలు సరైన పత్రాలు సమర్పించిన తర్వాత కమిటీ పరిశీలించి విశ్వసిస్తే ఆ సొమ్మును తిరిగి అందజేస్తారు. ఈ ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి కావల్సి ఉంటుంది. వారం దాటితే సీజ్ చేసిన నగదును ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతనే అందజేస్తారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే స్వాధీనం చేసుకున్న నగదును కోర్టుకు అప్పగించి విచారణ చేస్తారు. ఎన్నికల నియమావళి ముగిసిన తర్వాత కోర్టుకు ఆధారాలు సమర్పించి సొమ్మును విడిపించుకోవాల్సి ఉంటుంది.

జిల్లాలో తనిఖీలు


లక్ష్మణచాంద మండలం కనకాపూర్ వద్ద పోలీసుల తనిఖీ(ఫైల్)

జిల్లాలో తనిఖీలు ముమ్మరం చేశారు. తానూరు, కుభీర్ మండలాల పరిధి, సారంగాపూర్ మండలం సిరిపల్లి వద్ద మహారాష్ట్ర సరిహద్దులో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అంతర్ జిల్లా సరిహద్దుల్లోనూ ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమతి లేని నగదు, ఆధారాలు లేకుండా ఇతర వస్తువులు, మద్యం వంటివి సరఫరా చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని పోలీసుశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

రూ.లక్ష నగదు పట్టివేత


పట్టుకున్న నగదుతో అధికారులు

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి గ్రామంలోని చెక్‌పోస్టు వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.లక్ష నగదు పట్టుకున్నామని ఎస్ఎస్‌టీ టీం అధికారుల బృందం తెలిపాయి. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్‌చేసినట్లు తెలిపారు. ఎస్సై జి.లింబాద్రి, మండల పరిషత్ సూపరింటెండెంట్ స్వామి ఉన్నారు.

మద్యం పట్టివేత

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ అనుబంధ గ్రామం దర్యాపూర్‌లో మంగళవారం పెట్రోలింగ్ చేస్తుండగా ఒకరు అక్రమ మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. దిలావర్పూర్‌కు చెందిన కోడె ముత్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లోకేశ్వరం: నర్సింహనగర్‌తండా శివారు ప్రాంతంలో అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. అక్రమంగా బెల్ట్ షాపును నిర్వహిస్తున్న మహేష్‌పై కేసు నమోదు చేశామన్నారు.

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన బుజ్జికి అఖిలాష్ ఇంట్లో నిల్వ ఉన్న మద్యాన్ని ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో మంగళవారం పట్టుకున్నారు. 11.60 లీటర్ల మద్యం విలువ సుమారు రూ.8093 ఉంటుందన్నారు. వీటిని స్వాధీనం చేసుకుని, అఖిలాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బెల్టుషాప్‌లపై దాడి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధి లోని శంకర్‌గుట్ట, దస్నాపూర్ కాలనీల్లో నిర్వహిస్తున్న బెల్టుషాప్‌లపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. మద్యం బాటిళ్లను సీజ్‌చేసి, ఇద్దరి నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.


కంట్రోల్ రూమ్‌లో విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది


మీడియా సెంటర్ విధుల్లో డీపీఆర్వో తిరుమల

అంతా కలెక్టరేట్ నుంచే..


ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం నిఘా పటిష్టం చేసింది. ఇందుకోసం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటుచేసి 24 గంటలు విధులు నిర్వహించేలా ఉద్యోగులను కేటాయించారు. వివిధ ప్రాంతాల నుంచి డబ్బు ఇతర సామగ్రి పంపిణీపై ఫిర్యాదులు అందుతున్నాయి. అలాగే ఓటు ఉందో లేదో అని కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి తెలుసుకుంటున్నారు. వివిధ పార్టీ అభ్యర్థుల ఎన్నికల ప్రకటనల కోసం డీపీఆర్‌వో కార్యాలయంలో మీడియా సెంటర్ కూడా ఏర్పాటు చేశారు. విధి నిర్వహణలో భాగంగా అధికారులు 24 గంటలు పర్యవేక్షణ చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


ఫిర్యాదు స్వీకరిస్తున్న పోలీస్ సిబ్బంది


కాల్ సెంటర్లో ఫోన్‌లో ఫిర్యాదు స్వీకరిస్తూ..

ప్రచారంలో పసివాళ్లు



లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులకు దసరా సెలవులు కావడంతో పార్టీ ప్రచార రథంలో సరదా తిరిగారు. విద్యార్థులకు ఎన్నికల ప్రచారం సరదా నెలకొంది.

కేసీఆర్ చేతిలో రాష్ట్రం బందీ

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: సోనియా గాంధీ ఇచ్చిన తెలంగాణ సీఎం కేసీఆర్ కుటుంబం చేతిలో బందీ అయిందని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆరోపించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చి సోనియాగాంధీకి బహుమతి ఇద్దామన్నారు. వందలాది మంది తెలంగాణ కోసం బలిదానం అయ్యారని, బాగుపడింది మాత్రం కేసీఆర్ కుటుంబమేనన్నారు. నిర్మల్ ప్రజల ఓట్లతో గెలిచిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మామడ మండలంలో ఎన్ని డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కబ్జాల మంత్రి, సండే ఎమ్మెల్యేతో ప్రజలకు ఒరిగిందేమీలేదని వచ్చే ఎన్నికల్లో ఇద్దరికి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌కు చెందిన సర్పంచ్ లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు, మాజీ వార్డు సభ్యులు కాంగ్రెస్‌లో చేరగా, శ్రీహరిరావు వారికి కండువాలు కప్పారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు మామడ మండలంలోని పోతారం గ్రామస్తులు తీర్మానం చేశారు.

గ్యారెంటీ పథకాలకు వివరించాలి

దస్తురాబాద్: కాంగ్రెస్ ప్రకటించిన గ్యారెంటీ పథకాలను నాయకులు ఇంటింటికీ వివరించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భోజ్జు పటేల్ సూచించారు. మండలంలోని దేవునిగూడెం, రేవోజీపేట గ్రామాల్లో మంగళవారం ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయలన్నారు. అనంతరం దేవునిగూడెం సర్పంచ్ అంజన్న, పొద్దుటూరి శశిలా, రాజన్న, సత్తన్న కుటుంబాలను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేశ్, నాయకులు చుంచు భూమన్న, భూషణ్, రాజు, ఇద్రు పటేల్, రమేశ్, మల్లేశ్‌యాదవ్ ఉన్నారు.


పార్టీలో చేరిన గ్రామస్తులతో శ్రీహరిరావు

గ్యారెంటీ పథకాలు అమలు చేస్తాం

లక్ష్మణచాంద: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. మండలంలోని వడ్యాల్ గ్రామంలో మంగళవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని సీఎం కేసీఆర్ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు మేనిఫెస్టో ప్రకటించారని విమర్శించారు. నాయకులు సాగర్, రామకృష్ణ, ఓడ్నాల రాజేశ్వర్, అట్ల రామ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఈటల శ్రీనివాస్, బూసి భూమన్న, గంగాధర్‌గౌడ్, భీమన్న, నారాయణ, రమేశ్ ఉన్నారు.

ఆలయ కోనేరులో పడి ఒకరి మృతి


వివరాలు సేకరిస్తున్న ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయ కోనేరులో పడి మంగళవారం ఒకరు మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతుడి ఫోన్ డేటా ఆధారంగా మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మబాద్ తాలూకా, రత్నాలకు చెందిన ఊరేకర్ లింగురాం(26)గా గుర్తించారు. ఈ విషయాన్ని మృతుడి కుటుంబీకులకు తెలియజేశారు. తండ్రి పుండలిక్ బంధువులతో కలిసి అడెల్లికి చేరుకుని మృతదేహం తన కుమారుడిదేనని నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. కాగా, అమ్మవారిని దర్శించుకునే క్రమంలో ప్రమాదవశాత్తు కోనేరులో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

సంప్రోక్షణ పనులు ప్రారంభం

ఈ ఘటన నేపథ్యంలో ఆలయ కోనేరు సంప్రోక్షణ(శుద్ధి) చేసే పనులను ఈవో రవికిషన్‌గౌడ్ మంగళవారం ప్రారంభించారు. ఈనెల 21, 22వ తేదీల్లో మహాపోచమ్మ గంగనీళ్ల జాతర సమీపిస్తుండడంతో పనులు వేగంగా చేపట్టనున్నట్లు తెలిపారు. కోనేరు శుద్ధి అనంతరం పూజలు తర్వాత తిరిగి నీరు నింపే పనులు చేపడుతామన్నారు.

కొండూరికి జాతీయ సాహిత్య పురస్కారం


పోతన్న (ఫైల్)

సోన్: నిర్మల్ జిల్లాకేంద్రానికి చెందిన కవి కొండూరి పోతన్నకు డాక్టర్ బోయిభీమన్న స్మారక జాతీయ సాహిత్య పురస్కారం లభించింది. కొండూరి గుండెచప్పుడు అనే కవిత సంకలనం, రచనతోపాటు సమకాలీన అంశాలపై వందలాది పద్యాలు రచించినందుకు 2023 సంవత్సరానికి గాను ఆయన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. మంగళవారం ఏపీలోని తిరుపతిలోని బాకరాపేటలో ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారం ప్రదానం చేశారు. పోతన్న.. సోన్ మండలం న్యూవెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. పురస్కారం అందుకున్న ఆయన్ను హెచ్ఎం విద్యాసాగర్, ఉపాధ్యాయులు, సర్పంచులు గంగామణి, హారిత, వీడీసీ సభ్యులు గ్రామస్తులు అభినందించారు.

సజావుగా బీఈడీ కౌన్సెలింగ్


ప్రవేశపత్రం అందజేస్తున్న డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో కేబీ ప్రాంగణంలో నడుస్తున్న బీఈడీ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం సజావుగా సాగింది. ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. మెరిట్ ప్రకారం కళాశాలలో ప్రవేశపత్రాలు అందజేశారు. డీడీ మాట్లాడుతూ గిరిజన అభ్యర్థులకు బీఈడీలో చదువుకునేందుకు ఎంట్రెన్స్ లేకుండా అడ్మిషన్లు కల్పిస్తున్నామని అన్నారు. మొత్తం వంద సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

దుర్గమ్మా..సల్లంగ చూడు



శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నిర్మల్ జిల్లావ్యాప్తంగా మండపాల వద్ద ప్రతిష్ఠించిన దుర్గామాతకు మంగళవారం భక్తులు పూజలు నిర్వహించారు. రోజుకో రూపంలో అమ్మవారు దర్శనమిస్తుంది. ఆలయాల్లో దుర్గామాతకు పూజలు చేసి సల్లంగ చూడు తల్లీ అని వేడుకున్నారు. పలు ఆలయాల వద్ద జరిగిన కుంకుమార్చనల్లో మహిళలు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



బాసరలో నవరాత్రి ఉత్సవాలు


అమ్మవారిని దర్శించుకున్న రామారావుపటేల్

భైంసా: చదువుల తల్లి బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మూడో రోజు మంగళవారం వేకువజాము నుంచే భక్తుల రద్దీ కనిపించింది. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడ సూర్యేశ్వరస్వామిని దర్శించుకుని బాసర ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక క్యూలైన్‌లో వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. చిన్న పిల్లలతో అక్షరాభ్యాస పూజలు చేయించారు. సరస్వతీ అమ్మవారిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రామారావుపటేల్, సతీశ్‌రావు, కిశోర్‌దేశాయి, శంకర్, సుభాష్, రాజేశ్వర్, శ్రీనుపటేల్, లక్ష్మణ్, సాయినాథ్, రమేశ్, సతీశ్‌రెడ్డి, పోతన్న, కృష్ణ, గడ్డం అనిల్ పాల్గొన్నారు.

ఆలయంలో నిత్యాన్నదానం

శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బాసర ఆలయంలో నిత్యాన్నదానం కొనసాగుతోంది. నాందేడ్‌కు చెందిన జగదీశ్‌మహారాజ్ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. భక్తులకు ఇక్కట్లు తలెత్తకుండా బాసర ఎస్సై గణేశ్ బందోబస్తు నిర్వహించారు. విద్యుత్ కాంతుల మధ్య రాత్రి సమయంలో ఆలయం కాంతులీనుతుంది. అమ్మవారి అలంకార మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

పేకాటరాయుళ్ల అరెస్టు

బోథ్: మండలంలోని జీడిపల్లె శివారులో మంగళవారం ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. పక్కా సమాచారంతోనే దాడి చేయగా పట్టుకున్నామని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.22,190 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.